"ఏవండీ! మిమ్మల్నే!" సరస్వతి మొగుణ్ణి పిలిచింది.

అతను నారాయణమూర్తి. ఇంగ్లీషు లెక్చరర్, తల్లి సర్వలక్ష్మి. తండ్రి సోమయాజులు. ముగ్గురు కూతుళ్ళు.

"ఆ !"

"భోజనానికి లేవండి. కాలేజీ టైమైంది. పిల్లలిప్పుడే కూర్చున్నారు."

"కాలేజి పది గంటలకి-ఎనిమిదిన్నరేగా అయ్యిందీ. కొత్త పద్యం రాశాను వింటావా."

"పిల్లలకి మూడు రెళ్ళు ఆరు జెళ్ళు వేయాలి. డబ్బాలు కట్టాలి. స్కూల్‌కి పంపాలి. ఈ పద్యాలూ—పైత్యాలూ ఎందుకండీ, సిరా దండగ. చక్కగా ప్రైవేట్లు చెప్పుకోరాదూ?"

"ప్రైవేట్లు చెప్పే ఓపికా, తీరికా, కోరికా లేవు నాకు."

"ముగ్గురు కూతుళ్ళున్నారు చదువులూ, పెళ్ళిళ్ళూ... గుర్తుంటోందా?"

"వాళ్ళకేం. రత్నమాణిక్యాలు."

"అవును తండ్రి హోదా, పిల్లల అంద చందాలు చూసి పెళ్ళి కొడుకులు పరిగెట్టు కొచ్చేస్తారు."

"పోనీ నువ్వు చెయ్యి ఉద్యోగం..."

"నా టెన్త్ క్లాస్ 'ఆనర్సు'కి ఉద్యోగాలు రెక్కలు కట్టుకు వాల్తాయి. ఈ "పొరుగింటి మీనాక్షమ్మను చూశారా" బాపతు ఉద్యోగాల కేం గానీ..."

"ఇంకోటి చెయ్యచ్చు. "ఆడవాళ్ళూ— ఉద్యోగాలూ" లాంటి వ్యాస పరంపర పత్రికలకి పంపించు. ఏదో పరకో గ్యారంటీ."

"ఇంక లేవండి. నే వెళ్తున్నా."

"నా పద్యం వినకుండానే? ఆధునిక కవిత్వం! అర్థం విడమరిస్తేగాని తెలియదు."

"ఈ అర్థంలేని రాతలు నాకేం అర్థం కావుగానీ నే పోతున్నా."

"అమ్మా! అన్నం పెట్టవే" నారాయణ మూర్తి తల్లిని పిలిచాడు.

"సరస్వతీ! నీ మొగుడికి అన్నం పెట్టుకో" సర్వలక్ష్మి కోడలితో చెప్పి, కొడుకుతో చెప్పడం మొదలు పెట్టింది:

"ఒరేయ్ మూర్తీ! పిల్లల కిప్పటి నుంచీ పొదుపు నేర్పించండిరా: పెద్దదానికి వంకాయ నచ్చదు. చిన్నదానికి బెండకాయ సయించదు. పూటకి మూడు కూరలా! ఇదేం దివాణవా! మనవేవన్నా జమిందార్లవా? పెన్సిళ్ళు చెక్కేసు కోవడం, సిరా ఒలకబోసేయడం, పుస్తకాలు పారేసుకోవడం ... బట్టలు చూడు ఎలా ఉన్నాయో - బొత్తిగా ఒబ్బిడి లేదురా పిల్లలకి."

"పిల్లలంటే ఆ మాత్రం పెంకితనం, అల్లరీ ఉండవేమిటే?" నారాయణమూర్తి అనురాగం.

"ఆడ పిల్లలకి కట్టడీ; మర్యాదా, మప్పితనం నేర్పించాలి. రేపొద్దున్న పెళ్ళిళ్ళయితే ఇలాగేనా?"

"అబ్బబ్బబ్బ! పట్టుమని పదేళ్ళు లేవు పెద్దదానికి. అప్పుడే పెళ్ళి మాటలా?"

"ఆడపిల్ల పుట్టగానే ఆలోచించవలసింది పెళ్ళి మాటే"

"ఆ ! అవే అవుతాయి పెళ్ళిళ్ళు."

"అవున్నా! ఇంతోటి రంభలూ దొరక్క పోతారని ఎగరేసుకు పోతారు నీ కూతుళ్ళని."

సోమయాజులు కొడుకు దగ్గరకు వచ్చాడు.


"మూర్తీ! నేనూ, మీ అమ్మ ఎల్లుండి తంబి (నారాయణమూర్తి తమ్ముడు. భిలాయ్‌లో ఇంజనీరు) దగ్గర కెళ్తున్నాం. తిథీ నక్షత్రం, వారం అన్నీ బాగున్నాయి. ముహూర్తం మీ అమ్మే పెట్టింది. చెల్లాయి (నారాయణమూర్తి చెల్లెలు) పురిటికి వస్తోందిట."

"అక్కడికొస్తోందా?"

"అవున్నా! వాడికా జీతం ఎక్కువ. ఒక్కడే కొడుకు. నీకా ముగ్గురూ ఆడపిల్లలే. బొటాబొటీ సంపాదన. మూడో నెలలో తల్లినీ, పిల్లనీ తీసు కొని ఇక్కడికొస్తాంలే. ఓ వారం రోజులుంటారు."

"మీ ఇష్టం."

నారాయణమూర్తి సైకిలు తీసుకొని కాలేజీకి బైలుదేరాడు. టైమ్ తొమ్మిదిన్నర అయింది.




నారాయణమూర్తి సైకిలు నెమ్మదిగా సాగుతోంది. అతనికేం కష్టాలు, నష్టాలూ లేవు. పెళ్ళి చేసుకుని సుఖంగా నెట్టుకొస్తున్నాడు జీవితం.

హాయిగా —— హాపీగా

సాఫీగా —— స్లోగా.

ప్రమోదభరితంగా — ప్రమాదరహితంగా సాగుతోంది.

అయినా ఏదో లోటు...అర్థంకాని వెలితి... ఎందుకో తపన...

ముగ్గురు ఆడపిల్లలు... 20వ శతాబ్దపు చరమాంకంలో కూడా భారమా...నిజంగానే?

"హల్లో మూర్తీ" కాషాయ వస్త్రాలూ, మెళ్ళో రుద్రాక్ష తావళం... పొడుగాటి గడ్డం,

పలకరించింది మూర్తిని.

"మీరూ..." నారాయణమూర్తి అర్థోక్తి.

"నేన్నా కృష్ణారావునీ".

"హోరీ! నువ్వ్రటా! ఈ వేషమేవిటి?"

"జై సద్గురు మఠంలో చేరాను. అఖలిత బ్రహ్మచారిని. అయామ్ వెరీ హేపీ నౌ."

"నువ్వేం చేస్తుంటావు? నిన్ను కూడా స్వామిజీ అనాలా?"

"సంసారంలో ఉంటూ తామరాకుకు నీళ్ళంటనట్లు ఎలా ఉండాలో చెప్తుంటాం. అది గాక మా స్వచ్ఛంద సేవాదళాల సాంఘిక సంక్షేమ కార్యకలాపాలు వేరే వున్నాయనుకో. మా మఠం గురించిన బుక్‌లెట్, పాంప్లెట్ ఇస్తాను. అర్థమౌతుంది. నువ్వేం చేస్తున్నావ్?"

"లెక్చరర్ని"

"గవర్నమెంటు ఉద్యోగివా ?"

"కాదు. ఏం?"

"నిన్ను చూస్తే గవర్నమెంటు ఉద్యోగిలా వుంటేను."

"అంటే నీ ఉద్దేశం."

"నో కామెంట్. పెళ్ళయిందా? పిల్లలా!"

"ఆ !ఒక అర్థాంగి, ముగ్గురమ్మాయిలు. నీ సంగతేవిటి? ఇంక సన్యాసవే ?"

"ఆ . వీ ఆర్ ట్రయింగ్ టు బ్రింగ్ ది వరల్డ్స్ అటెన్షన్ టు ఇండియన్ స్పిరిచ్యువలిజమ్. ఇండియా ఈజె స్పిరిచ్యుయల్లీ హైలీ ఇవాల్వ్డ్ కంట్రీ. టేక్ మై వర్డ్. ది హోల్ వరల్డ్ విల్ లుక్ టు ఇండియా ఫర్ స్పిరిచ్యువల్ సక్కర్ వన్ డే."

"ఇంటికొస్తావా! వరద రాజా స్ట్రీట్‌లో ఉంటున్నా."

"ఓయస్. విత్ ప్లెజర్"

"అంతా ఇంగ్లీషేనా?"

"మా మఠంలో ఫారిన్ డిసైపుల్స్ ఎక్కువ."

"భోజనానికి కొచ్చేయ్ — రాత్రికి."

"భోజనం చెయ్యను. ఫలహారం — నో ప్రాబ్లెమ్."

"అన్నం భిన్నవేగా"

"అంతే అంతే. సీ యు" సన్యాసి వెళ్ళాడు. మూర్తి సైకిలు కదులుతోంది. సత్— న్యాసం...సన్యాసం. ఎవడెక్కువ సుఖి— సన్యాసా సంసారా... స్పిరిచ్యుయలిజం... వేదాంతం...ఫిలాసఫీ...ఫిలస్...సోఫియా లవ్ ఆఫ్ విజ్‌డమ్...లవ్ ఆఫ్ నాలెడ్జ్ ఏది నిత్యం? ఏది సత్యం? ఏది ఆనందం? సన్యాసికైనా తెలుసా "జరామరణ జంభయం నాస్తి తేషాం యశః కాయే"... అల్ ది పాత్స్ ఆఫ్ గ్లోరీ లీడ్ ఇన్ టు ది గ్రేవ్ — అంతా అయోమయం... గందరగోళం... లైఫ్ తొమ్మిదీ నలభై అయింది.

క్రీచ్...బుల్లెట్ మోటార్ సైకిల్ సడన్




బ్రేక్‌తో ఆగింది. మూర్తి బాలన్సు తప్పి సైకిల్ మీద నుంచి కిందపడ్డాడు. బుల్లెట్ మీద ఒకతనూ...ఒకావిడా.

"హల్లో మూర్తిగారూ" సుతి మెత్తని పలకరింపు.

"ఎవరు" మూర్తి సందిగ్ధం.

"నేనండీ. లలితను."

అవును గుర్తొస్తోంది.

ఆలోచనల మడుగులోంచి... జ్ఞాపకాల మడుగులోంచి పొరలలోంచి... అరలలోంచి... గుర్తింపు తళుక్కుమంది.

అవును లలితే...

కుసుమ కోమలం...సురూప

సౌకుమార్యం

మందస్మిత సుందర వదనారవిందం

మనోహరం...మనోజ్ఞ్వలం

మహోన్నతం

"మీట్ మై హస్బెండ్ రామారావ్ బ్యాంక్ మేనేజరుగా చేస్తున్నారు."

"నమస్కారమండీ" మూర్తి తడబాటు.

మేనేజర్— పెర్క్స్, టోటల్ ఇమాల్యుమెంట్స్ కలసి జీతం మూడు వేలపైచిలుకు

మాటే. వెలిగిపోతున్న రామారావ్ జీతం. రామారావ్ మోటార్ సైకిల్, రామారావ్ జీవితం.

వెలవెలబోతున్న తనూ, తన జీతం, తన సైకిలూ...

"మీరెక్కడుంటున్నారు? పెళ్ళయిందా, పిల్లలా?" లలిత అప్యాయంగా పలకరించింది మూర్తిని.

"వరదరాజ స్ట్రీట్. అయ్యింది. ముగ్గురు కూతుళ్ళు. మీకు?"

"ఇద్దరు మగపిల్లలు."

"అలాగా" మూర్తి హీనస్వరం.

"వీలున్నప్పుడు మీ ఆవిడతో మా యింటికి రండి. విలియమ్స్ స్ట్రీట్. వస్తానండి. బై."

అపశ్రుతులు లేని ... అపస్వరాలు రాని కర్ణ పేయ సంగీతం రామారావ్, లలితల జీవితం.

అంతేనా!! ఆనందం ఎక్కడుంటుంది? వారి జీవితంలో ఏ నివురు ఎంత నిప్పును కప్పిందో తనకేం తెలుసు? డబ్బు మనిషికి హోదానిస్తుంది. విలువ పెంచుతుంది. ఆనందాన్నిస్తుందా. అదృష్టం ఏ రూపంలో ఉంటుంది? భార్య రూపంలోనా? భర్త రూపం లోనా? పిల్లల రూపంలోనా? ఉద్యోగ రూపం లోనా? లలితా, రామారావ్‌లు నిజంగానే సుఖంగా వున్నారా? వుండనీ — సర్వేజనా సుఖినోభవంతు.

ఆలోచనలు అలలై ఊపేస్తుంటే సైకిల్ వేగం పెంచాడు మూర్తి. టైమ్ తొమ్మిదీ యాభై.

* * *

లంచ్ టైము. నారాయణమూర్తి నీరసంగా కూర్చున్నాడు. మూడు క్లాసులు ప్రొద్దున. నాన్ డిటెయిల్డ్ ఇంటర్ సీనియర్స్‌కి, డ్రామా బి.ఎ.ఫస్టియర్‌కి, పొయెట్రీ బి.ఎ. సెకండ్ ఇయర్‌కి ఏకబిగిని చెప్పటం ... నిస్సత్తువ ... మధ్యాహ్నం ప్రోజ్ క్లాసు తీసుకోవాలి... బతకలేక బడిపంతులు ఉద్యోగం. జీతం చాలక కాదు... ఊపిరి పీల్చేసే వృత్తి ఉపాధ్యాయ వృత్తి. అజ్ఞాన తిమిరాలని పారదోలే విజ్ఞాన దీపికా గురువు? టీచరు నిజంగా అంత వున్నతుడా...ఆర్కిటెక్ట్ ఆఫ్ ది నేషన్... ఏమో!

"హలో మూర్తిగారు" ఫిజిక్స్ లెక్చరర్ సుబ్రమణ్యం పిలిచాడు. గుండు కొట్టు కున్నాడు.

"తిరుపతి వెళ్ళారా" మూర్తి పలకరించాడు.

"మరేనండీ. మా పెద బాబుకి మెడిసన్ సీటొస్తేనూ!"

"ఎంట్రెన్స్ ఎగ్జామ్ అయిపోయిందా"

"అవునండీ పాసయ్యాడు. అది పురుష కారం అనుకోండి— దైవయత్నం కూడా ఉండాలిగా"

నమ్మకాలూ, మొక్కులూ, దేవుడిలోని నమ్మకం — కొడుకు సీటు కోసం తండ్రికి గుండు కొట్టించింది. ముగ్గురు కూతుళ్ళేంటీ తను ఏ పురుషకారం చేస్తున్నాడనీ—ఏ నమ్మకాలను పెంచుకున్నాడనీ! శరణ్యత్వేన పాణినా... స్వచరణౌ కృపయదిశతే... శరణన్న వాడిని కాపాడే ఆపద మొక్కులవాడు. ఆస్తికత్వం, నాస్తికత్వం, ఆధ్యాత్మికత్వం, భౌతికత్వం ఏది నమ్మాలి, ఏది విడవాలి — గోవిందా ... గోవింద ....

సాయంత్రం నాలుగు నుంచి అయిదు వరకు లీజరు. మాథమటిక్స్ లెక్చరర్ దీక్షితులు దగ్గర కొచ్చి మూర్తికి ఇన్విటేషనర్ కార్డిచ్చాడు.

"మా అమ్మాయి పెద్ద పిల్లయింది. మా ఆవిడ మీ ఆవిడకివ్వమన్న ఇన్విటేషన్ కార్డు"

"ఈ కాలంలో ఇంకా ... ఇలాంటి ఆచారాలా..."

"ఆచారాలనకండి, ముచ్చట్లు. మా అమ్మ ముచ్చటిది. తప్పకుండా మీ ఆవిడను పంపండి"

అర్థడాక్సీ— హెటెరెడాక్సీ ఆచారాలు. సంప్రదాయాలు — నమ్మకాలు..శకునాలు., ముచ్చట్లు...ఆర్భాటంగా పెళ్ళిళ్ళు... అట్ట హాసంగా కట్నాలు...ఒకరి ముచ్చట మరొకరి "ముల్లుట". ఆడ పిల్లల పెళ్ళి.. ముగ్గురూ ఆడ పిల్లలే...ఓహ్ గాడ్, ఇఫ్ దేరీజ్ గాడ్ సేవ్ మి!

## నానా-4
## అనుష్టుపులు

1

కంతుడో, కంజ నేత్రుండో
జయంతుండో, వసంతుడో,
పోటీ చేస్తే గెలుస్తారు
మన దేశం ప్రధానిగా!!

2

యుగంధరుడు, ముకుందు
చాణక్యుడు, బృహస్పతీ!
చిత్తుగా ఓడిపోతారు
నిలిస్తే పార్లమెంటుకు!!

3

వైరాగ్యం, భక్తి బోధించే
బాబాల ఆశ్రమాలలో!
సోఫాలూ, ఫోన్లు, మోటార్లూ
హెలికాప్టర్లు దేనికో?!!

4

'వ్యక్తిస్వేచ్ఛ' అనే భావం
పాశ్చాత్యుల వరం నిజం!
కామ, క్రోధ, మద ద్వేషా
దులకా స్వేచ్ఛ-ఆత్మకా?!!

'—శ్రీమాన్'


### చవులూరించే అల్పాహారం ఫ్రయమ్స్



రెండు నిమిషాలలో కరకరలాడె కమ్మని విదులెంది యీ ఫ్రయమ్స్‌తో తయారౌతుంది. నాలుగురకాల దేనికది ప్రత్యేకత కలిగిన చవులూరించే కమ్మని సువాసన కలిగి వున్న యీ మినీ జంతికల్ని స్వల్పంగా వేయించి తీస్తే వాలు ఇంతకు ఏదు రెట్లు పెద్ద సైజులో నోరూరించే సువాసనలతో సిద్ధ మౌతాయి. టి.టి.కె. సంస్థ (బెంగుళూరు) వుత్పత్తి చేస్తున్న యీ ఫ్రయమ్స్ ఒక 200 గ్రాముల ప్యాకెట్ రు.4.91 (స్థానిక పన్నులు అదనం) కు మార్కెట్లో లభ్యమవుతున్నది.

టైము అయిదు గింటలు అయింది. కాలేజీ అయిపోయింది.

* * *

"ఇంటికేనా?" బోటనీ లెక్చరర్ జగన్నాధం పలకరించాడు మూర్తిని.

"అవునండీ."

"మీ బ్రాంకియల్ అలర్జీ ఎలా ఉంది?"

"ఇటీజ్ మై ఓల్డు కంపానియన్."

"జోకేశారు గానీ, యోగా ట్రైచేయండి. అయిదారు ఆసనాలు ప్రాణాయామం చేస్తే తక్కువ సర్దుకుంటుంది. ట్రాన్సెండెంటల్ మెడిటేషన్ ఈ ఆసనాలకు జోడిస్తే రోగాలన్నీ మాయమవుతాయి."

"మీ ధోరణి సేల్స్‌మాన్ ఫక్కీలో వుంది."

"దగ్గరలోనే యోగా ఇన్‌స్టిట్యూట్ వుంది. నా ఫ్రెండందులో వున్నాడు. మీ గురించి చెప్తాను. దేరీజ్ నథింగ్ రాంగ్ ఇన్ ట్రయింగ్. బద్ధకోణాసనంతో నా కాన్‌స్టిపేషన్ ప్రాబ్లమూ, మత్స్యాసనంతో నా సైనసైటీస్ పోయాయి. వస్తారా?"

"మరొకసారి చూద్దాం"

## సూక్తిసుధ

**దుర్జనేన సమం వైరం**
**ప్రీతిం చాపి నకారయేత్**
**ఉష్ణో దహతి చాంగారః**
**శీతః కృష్ణాయతే కరావ్**

దుష్టులైన వారితో విరోధమూ వద్దు, స్నేహమూ వద్దు. బొగ్గును ముట్టుకొన్నామనుకోండి. నిప్పంటే చేతిని కాలుస్తుంది. లేకపోతే చేతికి మసి అంటుకొంటుంది.

**(సూక్తిముక్తావళి)**

"ఓ.కె."

టైము అయిదూ పది అయింది.

* * *

"పువ్వులు... మల్లెపువ్వులోయ్ ... పువ్వులు కొంటారా బాబయ్యా?" మల్లె పువ్వులవాడు పలకరించాడు.

ఏడు జడల కెన్నిపూలు కావాలో? మరి అమ్మకో!?

"వద్దు లేవోయ్."

సే ఇట్ ఫ్లవర్స్ అన్నారు. పువ్వులోని లాలిత్యం, మార్దవం... పరిమళింపూ— గుబాళింపు

మురిపెంపు అలరింపు

జీవితం ఎంత మొద్దుబారుతోంది... స్పందనలు కరవై సింథెటిక్‌గా...రొటీన్ నెస్ ఈజ్ టేకింగ్ అవే ది స్పార్క్ అవుటాఫ్ లైఫ్...

ఆప్యాయతా...ఆత్మీయతా... —జీ
రంగరింపు —వి
అభిమానం...అనురాగం... —త
మేళవింపు —ం

టైము అయిదు గంటల పదిహేను నిమిషాలు.

* * *

"అయిదు పైసలు ధర్మం చెయ్యండి బాబూ. ధర్మ ప్రభువులు..మహేశా పాప వినాశా..బాబూ పిల్లలు గలోణ్ణి... కైలాసవాసా ఈశా... పుణ్యం బాబూ...నిన్ను నమ్మినాను రావా"...

బిచ్చగాడు, భార్యా, ముగ్గురు పిల్లలూ వరుస వారీగా పాడుతూ అడుక్కుంటూ, అడుక్కుంటూ పాడుతున్నారు. అడుక్కుతింటూ





దొరుకుచోట్లు


1. డా. వుల్ఫెక్కి స్ట్రీట్, తెనాలి, ఫోన్.3150; 2. మాజేటి వీరరాఘవయ్య, శోభనాద్రి లేన్, విజయవాడ, ఫోన్.73567; 3. 1-3-166 రాజా మొదలియార్ స్ట్రీట్, కలాసిగూడ, సికింద్రాబాద్, ఫోన్.76160; 4. కోట శీతారామాంజనేయులు & కో., ఒంగోలు; 5. శ్రీరామకృష్ణ ట్రేడర్స్, నంద్యాల, ఫోన్.544; 6. రఘురామచంద్ర జనరల్ స్టోర్సు, నంద్యాల; 7. గుండా చినవెంకయ్యశెట్టి, 9/11 మెయిన్‌రోడ్, గుంతకల్-515501, ఫోన్. 335; 8. యొజ్జు నాగేంద్రం, గుంటూరు మరియు అన్ని ప్రముఖ కిరాణాషాపులు; 9. ప్రిన్స్ & కో., అన్ని బ్రాంచీలు, కాకినాడ. ఫోన్.4777; 10. చంద్రు నరసింహం 'స్టౌన్‌హౌస్‌పేట', నెల్లూరు; 11. అన్నపూర్ణ ట్రేడర్సు 145, అన్నాపిళ్ళై స్ట్రీట్, మద్రాస్. ఫోన్.23095; 12. యిమ్మిడిశెట్టి రామకృష్ణయ్య & సన్సు, బరంపురం, ఫోన్.2043; 13. శాంతిలాల్ చున్నీలాల్, యితవారీ, నాగపూర్, ఫోన్.42316, 42340; 14. బాలాజీ ట్రేడింగ్ కంపెనీ, 25, లేక్‌రోడ్, కలకతా. ఫోన్.461960

పిల్లల్ని పెంచే బిచ్చగాడు... పిల్లల గురించి ఏమాలోచిస్తాడు. ఈ రోజు పొట్ట నిండితే రేపు పొట్ట నిండే మార్గం గురించి... అంతే ... అంతకు మించిన ఆలోచనలేం వుంటాయి? అడుక్కుతినే పిల్లలకి అడుక్కు తినే మొగుళ్ళూ, పెళ్ళాలూనా?

మనస్సును కొరికేస్తూ, కరిచేస్తూ నమిలేసే ఈ ఆలోచనలు బిచ్చగాడి కుంటాయా ఉండవా... అదృష్టం అంటే ఆలోచనలు లేని, రాని జీవితం.

చదువుకొని, ఉద్యోగం చేస్తూ, తనదైన, స్థిరమైన సంపాదన వున్న తను పిల్లల్ని పోషించీ, పెంచుకోలేడూ?

పోషణ, సంరక్షణా లేని బిఘకజీవులు. కష్ట



జీవులు! తల్లిగా, భార్యగా మగాడి జీవితాన్ని పాలించేది ఆడది కాదూ! కూతురిగా ఆడపిల్ల బరువైందా?

తన కూతుళ్ళు రత్నమాణిక్యాలు.

మూర్ఖత్వానికీ, మూఢత్వానికీ సుదూరంగా పెంచుతాడు వాళ్ళని. కాలం మారక తప్పదు.

"యత్రనార్యస్తు పూజ్యంతే...రమంతే తత్రదేవతః" ఉరకలు వేస్తోంది మనసు.

అపూర్వంగా అనూహ్యంగా.

గుండెలనిండా నూతనోత్సాహం...నూతనోత్తేజం.

సైకిల్ "బులెట్" లాగా ఇంటి వైపుకి పరుగెడుతోంది.

టైము అయిదు గంటల యిరవై నిమిషాలు.

❋

## ప్రతి ప్రతిధ్వని

**పం**డిత పుత్ర అన్న మాటను అబద్ధం చేసిన వాడూ, 'శిలామురళీ' కర్తా, 'వైతాళికుల'ను తలపించే 'మహా సంకల్ప' సహ సంకలనకర్తా అయిన శ్రీ ఇంద్రగంటి శ్రీకాంతశర్మ గారు వ్రాసిన దానిలో (వి.ఎ.కె. గారికొక సమాధానం: 19-4-85) సాహిత్యభానమేదైనా వుండవచ్చునేమోగాని సమాధానం మాత్రం లేదు. నేను 'హంసధ్వని'లో (15-3-85) శ్రీ మల్లాది రామకృష్ణ శాస్త్రి గారి కథల సంపుటిలో వున్న కథల గురించి దాదాపు యిరవై సందేహాలు వెలిబుచ్చగా రెండిటికి ఓ మాదిరి వివరణా, రెండిటికి సగం వివరణా యిచ్చారు శ్రీ ఇం. శ్రీ.శర్మగారు.

'ఈ కథల యెంపిక తాను చేస్తే బాగుండుననే అభిప్రాయం రంగారావుగారు వాచ్యంగానే చెప్పారు.' ఇది నిజం కాదు. నేను చెప్పిన విషయసారాంశం యీపని ఒక్కరి ద్వారా జరిగితే బాగుండేదని. అప్పుడూ తొమ్మండు గురు పెద్దలను పేర్కొని చివర 'ఆఖరికి నన్ను' అని చేర్చడంలో వినయమూ, విజ్ఞతా శ్రీ ఇం.శ్రీ. శర్మ గారికందకపోవడం నా దురదృష్టం.

పైగా యెంపిక సరిగా లేదన్నది నా అభిప్రాయం కాదు. నేను ఆరోపణా చేయ లేదు. (నాకు నచ్చిన రెండు కథలు సంపుటిలో లేవన్న మాటకర్థం అది కాదు). ఎన్నిన వారొక్కరైతే, విషయం తెలిసిన వారయితే, ఆ విషయ వివరణే వారు చేసి వుంటే అటు పఠితల విజ్ఞానమూ పెరిగేది, యిటు కుతూహలమూ రేగేది, యింకా మంచి జరిగేదన్నది నా విమ ర్శలో ప్రధానాంశం.

ఇప్పటి సంకలనంలో నాకు 'ఒకరి' విశిష్ట దృక్పథం కనబడటం లేదు. ఒకరికొకరు భిన్నంగా చేయరని నేననుకోలేదు. భిన్నత్వం వుంటుందీ, వుండాలీ అనే నేను ఆశించడం. ఇప్పటి యెన్నికకైనా ఒక భర్తంటూ వుండి, చేపట్టవలసిన సంపాదక బాధ్యతలు సక్రమంగా భరించి వుంటే 'తొమ్మిదో' (నిజానికి పద కొండవ భేదం: శ్రీ ఇం.శ్రీ. శర్మ గారు రెండిటిని లెక్కించలేదు!) రుచి భేదాన్నీ' నేనూ హర్షించేవాడినే!

నేను తెలుగు చదవగలిగిన వాడినే కాని తెలుగు చదువుకొన్న వాడిని కాను. నేనెలా మానియర్ విలియమ్స్ సంస్కృతాంధ్ర నిఘంటువు చూసే ఓపిక చేయగలను! మల్లాది రామకృష్ణ శాస్త్రిగారి ఆశీస్సుపొందిన వాడినే కాని లింగడిలా శరం బట్టి అర్థరాత్రి నాలుకపై శ్రీకారం చుట్టించుకొన్నవాడిని కాను మరి.

శ్రీ ఇం.శ్రీ. శర్మ గారుదహరించిన సంస్కృతోక్తి నాకు తెలియక పోయినా 'విజ్ఞులు వివిధాలుగా చెప్తా'రన్నవిషయం తెలిస్తేనే గదా 'వారి అభిరుచి మేరకు ఏరిన కథలకు వారికి తోచిన వివరణా...!'అని వ్రాయగల్గుతాను? పెద్ద వారి ఆశీస్సులు తక్షణ ఫలదాయకాలంటారు. ఈ చిన్నవాని ఆశీస్సు (బాలుడయ్యును వృద్ధుండు కవివరుండు; తప్పలేదు) 'పై సూక్తి రంగారావుగారికి తెలిసి వుంటే బాగుండు: అస్తు!' అన్నది, రిట్రాస్పెక్టివ్ యెఫెక్ట్‌తో, ఫోర్త్ డైమెన్షన్‌లో వెనక్కు వెళ్లి ఫలవంతమైనదా ఒకవేళ?

నా హంసధ్వని వామరావేశం శ్రీ ఇం. శ్రీ. శర్మ గారికింత చిరాకు కలిగించిందంటే జరిగిన ఆకాశరామన్న సంపాదకత్వంలో, చేయవలసినవి జరగకపోవటంలో వీరికీ ఒక వేలుందన్న అనుమానం కల్గుతున్నది. తక్కిన పెద్దవారి చిరాకుపత్రాలూ ఆలస్యంగానైనా ఆశించవచ్చునా లేక అందరు విద్య'శ్రీ'లూ కుమ్మక్కై వ్రాసినదా శ్రీ ఇం.శ్రీ. శర్మగారి వుత్తరం?

చివరిమాట. అదే సంచికలో అభిప్రాయవేదికలో నా హంసధ్వనిని ప్రశంసిస్తూ వ్రాసిన యు. మధుసూదన రావుగారిదే హంసత్వం, నాది కాదు. నేను వ్రాసిన దానిలో మంచినే స్వీకరించగలిగారు. నన్ను నిరుత్తరుడిని చేశారు. వారు 'చదువుకొన్న' వారు కాదనీ, సాహిత్యారాధకులనీ నా నమ్మిక.

— వి.ఎ.కె. రంగారావు